

# వాసంతి

### రంగధామి

చంద్రమౌళి పిచ్చివాడిలా అయిపోవటానికి కారణం ఏదో ఉందని డాక్టర్ కనిపెట్టాడు కాని పిచ్చికి మందు ఆయన ఇవ్వగలడా ?

---

చంద్రమౌళి ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ ఒక్కడే చాలాదూరం వెళ్ళాడు మనిషి ఎదిగినకొద్దీ, ప్రకృతిలోని గొప్పతనం అర్థమౌవుతుంది తన భావాల్నీ, ఆనందాన్నీ, విషాదాన్నీ, మంచినీ, చెడునీ అన్నిటినీ ప్రకృతిలో చూడగల్గుతాడుమానవుడు తన మనస్సు వికసిస్తున్నకొద్దీ, ప్రకృతిపై భావాల్ని ప్రదర్శిస్తూ తనహృదయంతో అనుబంధం ఏర్పరచుకొంటుంది వికసించిన కుసుమాల సౌందర్యం, వికసిత మాత్న యవ్వనులకు విశిష్టంగా గోచరిస్తుంది ఆకాశంలో మేఘాలు విజృంభించినప్పుడూ, పెనుతుఫాను చెలరేగినప్పుడూ, వ్యథాపూరితహృదయాలు, తమ బాధామయజీవితాలతో ప్రకృతిని పోల్చుకుంటాయి జీవితంలో విసిగి వేసారిన పథికుడికి మిణుకు మిణుకుమనే నక్షత్రాలూ, గతితప్పని సూర్య చంద్రులూ, తనలాగే దైవోపహతుల్లా కనిపిస్తాయి.

చుట్టూ పొలాలూ, మధ్య చిన్న కాలిబాటా, గట్లమ్మట విటూరుగా నుంచున్న తాటిచెట్లూ, ఎర్రదనంకూడా తగ్గిపోతున్న ఆకాశం, వీటిని చూస్తూ చంద్రమౌళి మెల్లిగా నడుస్తూ, తనని తాను మర్చిపోయాడు. ఎదురుగుండా ముగ్గురమ్మా

యిలు కిలకిలా నవ్వుకుంటూ వస్తున్న దృశ్యం కూడా అతను గమనించలేదు ఆకాశంవైపు అలాగే నిలబడి చూస్తున్నాడు

ముగ్గురూ సన్నగా, నాజూకుగా ఉన్న అమ్మాయిలు ఒకమ్మాయికి పద్దెనిమి దేళ్ళుంటాయి ఇంకొకమ్మాయికి పదహారు మూడవ అమ్మాయి పన్నిండేళ్ళ వయసులో ఉంది నవనాగరిక ఫేషన్లన్నీ వాళ్ళలో ఉన్నాయి కాళ్ళకు నుంచి జోళ్ళూ, పౌడర్లద్దిన మొహాలూ, చేతికి రిస్టువాచీలూ వాళ్ళ నాగరికతను వెల్లడిస్తున్నాయి

“ఎవరో కవి కాబోలే! ప్రకృతి తెగ పరిశీలిస్తున్నాడు.”

“ఈ పల్లెటూరికి, ఒక కావ్యం రాయడానికి వచ్చాడు కాబోలు!”


“లేకపోతే సంఘసంస్కర్తేమో! పంచే, లాల్చీ పట్టిస్తున్నాయి.”

“మరే! పాపం! ఇక్కడ ఈయన సంస్కరణ ఎవరికీ అక్కర్లేకపోయింది కాబోలు పొలాల్నీ, ఆకాశాన్నీ చూసి తృప్తిపడుతున్నాడు”

అవి వాళ్ళలోవాళ్ళ చంద్రమౌళిని గురించి విమర్శించుకుంటూ అతన్ని దాటిపోయారు వాళ్ళ ముగ్గురూ, ఆవూరుకు కొత్తగావచ్చిన డాక్టరుగారమ్మాయిలు డాక్టరు జానకిరావ్, ఆ పల్లెటూరి డిస్పెన్సరీకి మెడికల్ ఆఫీసరుగా బదిలీ అయి వచ్చి నెలరోజులయింది ఆయనకుటుంబం మూడు రోజులక్రిందటే ఆవూరు వచ్చారు ఆయనకు ముగ్గు రమ్మాయిలూ ఇద్దరబ్బాయిలూ ఉన్నారు పెద్దమ్మాయి ఇంటర్ పాసయింది రెండో అమ్మాయి స్కూల్ ఫైనలు పాసయింది తరువాత అబ్బాయి ఫిఫ్తుఫారమ్, అమ్మాయి ధర్డుఫారమ్ చదువుతున్నారు ఆఖరివాడు చిన్నవాడు

వాసంతి, జమున, సుశీలా ముగ్గురూ చాలా చురుకైన అమ్మాయిలు వాళ్ళ విశాఖపట్నంలో చదువుకుంటూ ఉండడంవల్ల, తండ్రి సాధారణంగా పల్లెటూళ్ళలోనే ఉద్యోగం చేస్తున్నా, చదువుకోసం పిల్లల్ని పట్నంలో ఉంచటంవల్ల, వాళ్ళకు పట్నవాసపుపోకడలే అబ్బాయి. తండ్రి డాక్టరవడం మూలాన, ఊళ్ళో ఉన్న పెద్దలందరితో స్నేహంగా ఉండడంవల్లా ఆవూరిలో బాగా ధనికుడూ, పలుకుబడిగలవాడూ అయిన సుదర్శనంగారింటికి స్నేహపూర్వకంగా వెళ్ళి, వాళ్ళు ముగ్గురూ తిరిగి వస్తూంటే చంద్రమౌళి వాళ్ళకు తారసపడ్డాడు అతన్ని చూసి వాళ్ళు నవ్వుకోడానికి చంద్రమౌళి వాలకమే కారణం అతను ఎప్పుడూ గంభీరంగా ఆలోచిస్తాడు మొహంలో ఎంతో అమాయకత కనిపిస్తూంటుంది అతను బాగా ఆలోచిస్తున్నప్పుడు చుట్టూ ఉన్న పరిసరాల్ని మర్చిపోతాడు

తను బాటకడ్డంగా నిలబడినా, తనను తప్పించుకొని వెళ్ళిపోయిన ముగ్గురమ్మాయిల్నీ అతను పరిశీలనగా చూడనేలేదు చీకట్లు కమ్ముకున్న ఆకాశం, నిశ్శబ్దం ఆవరించిన వాతావరణం, అతనిలోంచి ఒక వేడినిట్టూర్పు తెప్పించి, గృహోన్ముఖుణ్ణి చేశాయి ఇంటికి తిరిగివస్తూ, చంద్రమౌళి తనలోతను ఒక కథ చెప్పుకున్నాడు ఆకాశంలో ఒక పెద్ద మేడ కట్టాడుట. దానికి



గార్యచంద్రులు ద్వారపాలకులు ఆ మేడనిండా వెలిగే దీపాలే నక్షత్రాలు పాలవెల్లి పెద్ద పందిరి మంచంట ఆ మంచంమీద తను విష్ణుమూర్తిలా పడుకుంటాడు తన కాళ్లదగ్గర ఒకమ్మాయి వాసంతి ఉంటుంది తననుకుంటాడు, అంతా బాగానే ఉంది కానీ—ఏదో లోటుంది దృశ్యంలో అదేమిటి ? ఆ దృశ్యంలో ఉన్న లోటేమిటో చంద్రమౌళికి బోధపడలేదు

చుట్టూ ఉన్న నిశ్శబ్దాన్ని పరిశీలించి, తనూహించిన దృశ్యంలోని లోటును అర్థంచేసుకున్నాడు అక్కడా నిశ్శబ్దమే ! సూర్యచంద్రులు మాట్లాడరు నక్షత్రాలు ధ్వనిచెయ్యవు కలలో ఆ అమ్మాయీ మాట్లాడదు తనకేం మాట్లాడాలో తెలియదు చంద్రమౌళికి పెద్ద నవ్వొచ్చింది అసలీ కథంతా వట్టి అభూతకల్పన ఆకాశంతంలో నిశ్శబ్దం కాక మరేముంటుంది ?

నవ్వుకుంటూ ఇంటికి తిరిగివచ్చాడు చంద్రమౌళి

డాక్టరుగారి అమ్మాయిలు ఆ పల్లెటూరిగురించి తమ అభిప్రాయాలు వరసాగ్గా తండ్రితో చెప్తున్నారు.

"ఇన్ని పల్లెటూళ్లు చూశాంగాని, ఇటువంటివూ రెక్కడా లేదు"

"మమ్మల్ని చూసి జనం విరగబడిపోయారు ఈ ఊళ్లో బొత్తిగా చదువుకున్నమ్మాయిలు లేరు కాబోలు !"

"కొంతమంది ఆడవాళ్లు మమ్మల్ని చూసి ముక్కుమీద వేలేసుకున్నారు"

డాక్టరుగారికి ఆయనకూతుళ్ల మాటలంటే సరదా వాళ్లు ఎంత అల్లరిచేసినా కోప్పడరు "ఇంతకీ, సుదర్శనంగారింట్లో విశేషాలేమిటట ?" అని అడిగారాయన

"ఆయనభార్య చాలా మంచావిడలా ఉన్నారు మమ్మల్ని బాగా మర్యాద చేశారు వాళ్ల ఇల్లు కూడా చాలా బావుంది ఒక గదినిండా పుస్తకాల బీరువా లున్నాయి వాళ్లబ్బాయివిట 'లా' చదువుతున్నాడేమో ననుకొన్నాం 'లా' కాదుట ఏం చదువో అవిడ చెప్పలేదు ఎందుకో వాళ్లబ్బాయి విషయం ఎత్తేప్పటికి, ఆమెమొహం చిన్నబోయింది" అంది వాసంతి

"చెప్పినమాట వినడేమో ?" అంది జమున

"అబ్బే ! అదికాదు వాళ్లబ్బాయికి మతి స్థిరం లేదు" అన్నారు డాక్టరుగారు

"అయ్యో ! పాపం !" అన్నారు ముగ్గురు అక్కచెల్లెళ్లూ ఒక్కసారి

"చదవడం ఎం. ఏ. వరకూ చదివాడు హఠాత్తుగా పరీక్షలముందు ఇంటికి వచ్చేశాడట ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కూచుంటాడు మొదట్లో తలిదండ్రులు ఇతనికి మతి చలించిం దనుకోక, కేకలు వెయ్యడం, కోప్పడ్డం చేసేవారుట గట్టిగా కోప్పడితే ఏడ్చేవాడటగానీ ఏమీ సమాధానం చెప్పేవాడు కాడుట. వాళ్లకు మెల్లిగా అనుమానంవేసి ఒక పెద్దడాక్టర్ని తీసుకొచ్చి పరీక్ష చేయించారుట ఆయన ఇతని మనస్సుకేదో పెద్ద 'షాక్' తగిలింది బాగా విశ్రాంతిస్తే అతనే కోలుకుంటాడని చెప్పాడుట" అన్నారు డాక్టరుగారు.

# వాసంతి

"మీరుకూడా 'ఎగ్జామిన్' చేశారా, నాన్నా ?" అని అడిగింది సుశీల

"ఓ ! అతను నాకెంతో ముఖ్యస్నేహితుడై పోయాడు ఈ నెలరోజుల్లోనూ ! మామూలుగా అతనిలో పిచ్చేమీ కన్పించదు ఎప్పుడో ఒకసారి వస్తుందది ఈ నెలరోజుల్లోనూ రెండుసార్లు మాత్రం కన్పించింది ఒక రోజంతా ఉంటుంది మర్నాడు మామూలే"

"అసలెందుకు వచ్చింది, అతనికి పిచ్చి ?" అని వాసంతి అడిగింది

"ఆ, ఏముంది ? ఈ వయస్సులో ప్రేమ ప్రభావం ఎక్కువగా ఉంటుంది బహుశా ఇతను కాలేజీలో ఎవర్నన్నా ప్రేమించి ఉండవచ్చు ఆ వ్యక్తి ఇతనిని మోసగించి ఉండవచ్చు సున్నితమైన మనస్సు కలిగిఉండటంచేత ఇతను దానికి తట్టుకోలేకపోయి ఉండవచ్చు అనేకవందల కారణాల్లో ఇది ఒకటి అంతేగాని జరిగిందేమిటో

---

కారు యజమాని:—నేనీ కారు కొని ఇన్నేళ్లయిందిగాని, దీని రిపేరుకోసం ఒక్క కానీ కూడా ఇవ్వలేదు.

స్నేహితుడు—అవును. అలా అని కారులు రిపేరు చేసినవాడు చెప్పేడులే.

మంథా వెంకటసుబ్బారావు (అమలాపురం)

---

మనకు తెలియదుగదా !" అన్నారు డాక్టరుగారు

"మీరు మందేమన్నా ఇస్తున్నారా ?" అని అడిగింది వాసంతి

"మందు ఇస్తున్నాననుకో కాని అంతకన్నా అతనికి మనశ్శాంతి కావాలి తండ్రికీ, కొడుక్కీ చాలా అభిప్రాయభేదా లున్నాయి సుదర్శనంగారు కొడుకు నెంతో ప్రేమిస్తారు కాని కొడుకు భావాలుమట్టుకు ఆయనకు గిట్టవు వాళ్లిద్దర్నీ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే మనకే వెర్రెత్తుతుంది"

పిల్లలంతా నవ్వారు భోజనా లయిపోయాక అంతా సుదర్శనంగారి గొడవలు మానేసి స్వంతవిషయాల గురించి మాట్లాడుకున్నారు వాసంతి ఎం. బి బి. ఎస్ లో చేరాలని డాక్టరుగారు నిశ్చయించారు జమున ఇంటర్‌లో చేరుతుంది సెలవలు ఇంకా రెండునెల లున్నాయి కాలేజీలు తెరవగానే డాక్టరుగారి కుటుంబమంతా విశాఖపట్నం వెళ్లిపోతుంది

ఊరికి కొంచెం దూరంగా ఉన్న విశాలమైన భవనాన్ని డాక్టరు అద్దెకు తీసుకున్నారు. రాత్రయ్యేప్పటికి చుట్టూ చీకటి, నిశ్శబ్దం ఆవరించుకుంటుంది పల్లెటూళ్లలో రాత్రిళ్లు ఏమిటో నిస్ప్రహగా ఉంటాయి మధురమైన వేకువ ఎప్పుడొస్తుందా ! అని ఎదురుచూసేట్టు చేస్తాయి

మర్నాడు పొద్దున్నే చుట్టుపట్ల పల్లెటూరులో ఏదో 'సీరియస్' కేసొకటి రావడంవల్ల డాక్టరు వెళ్లిపోయారు ఎనిమిదిగంటలకు కాఫీ త్రాగి, హాలులో కూర్చొని పుస్తకం చదువుకుంటున్న వాసంతి, మనిషి అలికిడై తలెత్తేసరికి ఎదురుగుండా చంద్రమౌళి కన్పించాడు

"డాక్టరుగారు లేరా ?" అని సంకోచిస్తూ అడిగాడు

"లేరండీ ఏదో కేసుకోసం పక్క ఊరికి ప్రొద్దున్నే వెళ్లారు"

"అరెరె ! ఆయనతో చాలా అర్జెంటు పనుందే? ఇప్పుడెలా ?"

వాసంతి చంద్రమౌళిని చూడగానే, ఆ క్రితంరోజు పొలాలవద్ద చూసిన మనిషి ఇతనేనని గుర్తుపట్టింది కొందరివి, భావనామయమైన మనసులు వాసంతికి చంద్రమౌళిని చూస్తే, అతనొక కవి అయివుంటాడని ఊహ, నమ్మకం కూడా కలిగాయి ఆయన అభిప్రాయాల్ని తెలుసుకుందామనే కుతూహలమూ కలిగింది

"ఆయన వచ్చేదాకా కూర్చోండి" అని కుర్చీ చూపిస్తూ ఆహ్వానించింది

"థాంక్స్" అని, పెద్ద సమస్యను పరిష్కరించినవాడిలా కుర్చీలో ఆమెకెదురుగా కూచున్నాడు చంద్రమౌళి కూర్చున్నతరువాత ఏం చెయ్యాలో తెలియనట్లు పైకప్పుకేసి, వీధికేసి, హాల్లో పటాలకేసీ చూడసాగాడు తను కూర్చోగానే వాసంతి లోపలికి వెళ్లిపోతుందనుకున్నాడు ఆమె కదల్లేదు

"మీ దివూరేనాండి ?" అని అడిగింది వాసంతి

"ఈవూరే" అని ముభావంగా జవాబు చెప్పాడు చంద్రమౌళి

"ఇక్కడున్న స్కూలులో, మాస్టరుపని చేస్తున్నారా?"

"లేదు"

"మరి ?"

"నేనేం చేస్తున్నానో చెప్పమంటారా ? జీవితం గురించి ఆలోచిస్తూ ఉంటాను మన కళ్లెదుట మన కర్థంకాని విషయా లెన్నో జరుగుతుంటాయి వాటి సంగతేమిటంటారు ? మా మేనత్త ఒకామె చాలా అందమైనదీ, మంచి స్వభావంకలదీ, బాగా పాడుతుంది ఆమెకు పెళ్లయిన మరునటి సంవత్సరం భర్త పోయాడు అప్పటి కామె వయస్సు పదహారు. ఆమె గతేమిటంటారు ? మా మేష్టారుకి ఇద్దరబ్బాయిలు. పెద్దబ్బాయి ఇరవై ఏళ్లవాడు గోదావరి స్నానానికి వెళ్లాడు గజ ఈతగాడు నీటిలో మునిగి ఈత కొడుతూ పడవఅడుక్కి వెళ్లిపోయాడు ఘోరంగా చనిపోయాడు—పైకి రాలేక అత నెందుకు పోయాడంటారు ? ఇలాంటివెన్నో మనకళ్లముందర జరుగుతున్నాయి విధి అంటారా ? కర్మంటారా ? భగవంతుడున్నాడంటారా ? ఉంటే, ఇలాటి దురన్యాయాలకు ఒప్పుకొంటాడా? లేదంటారా ? లేకపోతే ఒకప్పుడు కాకపోతే ఇంకొకప్పుడైనా న్యాయం, మంచి గెలుస్తున్నాయి

అన్యాయం, చెడూ ఓడిపోతున్నాయి అంటారా?" అని వాసంతి వైపు చూశాడు

చంద్రమౌళి మాటలాడే తీరూ, అతని మాటలూ విని వాసంతి ఆశ్చర్యపోయింది తనంతవరకూ అతన్ని వేళాకోళం చేద్దామనే ఉద్దేశంతో అతనితో సంభాషణ ఆరంభించింది కాని అతను అలా గంభీరంగా ఆలోచిస్తాడనిగాని, అతని హృదయం ప్రపంచంలోని బాధలగురించి బాధపడే స్వభావం గలదనిగాని ఆమె ఊహించలేదు చంద్రమౌళి కళ్లల్లో భరింపరాని వేదన ఉంది మొహంలో అర్థంకాని చిరాకేదో ఉంది తను సంభాషణ పొడిగించడమా ? లేక అతన్ని వదిలిపెట్టి లోపలికి పోవడమా ? అన్న సమస్యలో పడింది వాసంతి ఏమైనా ఆమెకు లేవబుద్ధి పుట్టలేదు

"నాకూ అలాగే అనిపిస్తోంది"

"మీరు ఎంతో మంచిహృదయం కలవారిలా కన్పిస్తున్నారు ఒక్కొక్కప్పుడు, మంచివాళ్లను చూస్తే జాలీ, భయం, బాధా కలుగుతాయి ఎందుకంటే వాళ్లకి ఏదో తప్పక చెడు జరుగుతుంది ప్రకృతి మంచితనాన్ని సహించలేదు

"నా కాభయం లేదులెండి అయినా మీరు చెప్పినంత మంచితనం నాలో లేదులెండి" అంది వాసంతి ఇంతట్లో జమున లోపల్నుంచి వచ్చి తనకు బట్టలు కుట్టడం నేర్పమని వాసంతిని లోపలికి తీసుకెళ్లింది వాసంతి, తను వెంటనే తిరిగి వచ్చేస్తానని చంద్రమౌళితో చెప్పి లోపలికి వెళ్లింది

చంద్రమౌళి కాస్సేపు ఒంటరిగా కూచున్నాడు ఇంతలో డాక్టరుగా రొచ్చారు "హల్లో ! ఎంతసేపయింది మీరు వచ్చి ? మూడురోజులనుంచీ మీరు కన్పించకపోతే ఊళ్లో లేరేమో అనుకున్నా మా కుటుంబం వచ్చేసింది మా అమ్మాయిలు నిన్న మీ ఇంటికి కూడా వచ్చారు" అని డాక్టర్గారు చంద్రమౌళితో మాట్లాడుతూ "వాసంతీ" అని కూతుర్ని పిలిచారు

"ఈ మూడురోజుల్నుంచీ నేను బయటకు కదలకుండా ఇంట్లో కూచొని నాలుగు పుస్తకాలు చదివాను నిన్న నలా షికారుకు వెళ్లాను ఇవాళ మా అమ్మగారికి ఒంట్లో బాగులేకపోవడంవల్ల మిమ్మల్నొకసారి తీసుకెళ్దామని వచ్చాను" అన్నాడు చంద్రమౌళి

తండ్రిపిలుపు విని వచ్చిన వాసంతితో డాక్టరుగారు 'ఈయన సుదర్శనంగా రబ్బాయి, చంద్రమౌళిగారు మా ఇద్దరికి తొందరగా కాఫీ పట్రా నేను వాళ్లింటికి వెళ్లాలి" అన్నారు

ఆశ్చర్యంతో నిశ్చేష్ట అయిన వాసంతి 'అలాగే' అని లోపలికి వెళ్లిపోయింది, ఒక్క నిముషంలో తెప్పరిల్లుకుని కాఫీ కలుపుతూ, వాసంతి ఆలోచించింది ఎంత పొరపాటు ! ఆయన సుదర్శనంగారబ్బాయా ! ఆ పుస్తకాలన్నీ చదివినాయనా ! ఆయనకి మతి స్థిరంలేదని తన తండ్రి చెప్పారు పాపం ! ఆయన మనోవ్యథ ఏమిటో ! ఆయన మాటల్లో ఏమీ వింతలేదు

కాఫీ త్రాగాక డాక్టరుగారూ, చంద్రమౌళీ ఇద్దరూ కలిపి చంద్రమౌళి ఇంటికి వెళ్లారు సుదర్శనంగారు ఆయన్ని పలకరించారు చంద్రమౌళి "నాన్నగారూ, అమ్మను చూపించటానికి ఈయన్ను తీసుకువచ్చాను" అన్నాడు బాతాఖానీకి అది సమయం కాదన్నట్టు సుదర్శనంగారు మాట్లాడ్డం మానేసి లోపలికి తీసుకెళ్లమని చెప్పారు

డాక్టరుగారు పరీక్షచేసి, చంద్రమౌళితల్లికి గుండెజబ్బని నిర్ణయించారు బాగా విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు మందు తను రోజూ పంపిస్తానన్నారు డాక్టరుగారు వెళ్లాక, చంద్రమౌళి చాలాసేపు తల్లిదగ్గర కూర్చొని, ఆమె విశ్రాంతి తీసుకోవాలని బోధించాడు ఆమెకు చాలా ఆనందం వేసింది చంద్రమౌళి ఎప్పుడోగాని అలా, అంతసేపు మాట్లాడడు

రోజూ డాక్టరుగారింటికి వెళ్లి చంద్రమౌళి తల్లికి తానే స్వయంగా మందు తెచ్చేవాడు పది రోజులలో వాళ్ల కుటుంబంతో చంద్రమౌళికి బాగా పరిచయం ఏర్పడింది ఇంట్లో ఉన్నవాళ్లంతా అతనితో చనువుగా మెసిలేవారు. అందరూ కలిసి కారమ్స్ గాని, బ్రిడ్జిగాని ఆడుతుండేవారు చంద్రమౌళి మనస్సుకూడా కొంచెం కొంచెం ఉత్సాహపూరితం కాజొచ్చింది

కోమటి:- ఏమయ్యోయ్!
తెల్లారకుండానే తయారయ్యావు అరువుపెట్టడానికి. ఇంకా ఏం బోణీలేదు. తర్వాత రా.

వచ్చినవ్యక్తి:-బోణీ చెయ్యటానికే కదయ్యా వచ్చింది. ఇదిగో ఈ కాని తీసుకొని రెండు బీడీలియ్యి, ఇప్పుడు వీశ పంచదార పాలడబ్బా యిచ్చిపద్దు రాసుకో

డి పూర్ణానంద స్వరూప్

బ్రిడ్జిలో ఎప్పుడూ వాసంతే అతని పార్ట్నర్గా ఉండేది చంద్రమౌళికన్నా బాగా ఆడేది డాక్టరుగారి ఇంటికి వచ్చినదగ్గర్నుంచీ చంద్రమౌళి కళ్లు వాసంతికోసమే వెదుకుతూ ఉంటాయి జమున గాని, సుశీలగాని అతనితో అంత చనువుగా మాట్లాడరు అతనిమాటలు వాళ్లకు పట్టి పొదిలా కనిపిస్తాయి వాళ్ల అభిరుచులే వేరు జమునకు ఇంగ్లీషు సినిమాలూ, హిందీ సినిమాలూ అంటే ఇష్టం ఏయే ఇంగ్లీషు యాక్టర్లకు, ఏఏ ఫిల్ముల్లో నటనకు 'ఆస్కార్' లభించిందో, వాళ్లెన్ని వివాహాలు చేసుకున్నారో, వాళ్లు ఎన్ని ఫిల్ముల్లో నటించారో ఆమెకు కంఠతావచ్చు సుశీలకు క్రికెట్, భరతనాట్యం అభిమానవిషయాలు

వాసంతికి వీటన్నిటిమీదా ఇష్టం ఉందికాని అనంటే పిచ్చిలేదు ఆమె ఎలాంటి సంభాషణలోనైనా పాల్గొనగలదు ఎలాంటి వ్యక్తులతోనైనా కలిసి మెలిసి మాట్లాడగలదు కాని ఏ వ్యక్తులయినా ఆమెకు నచ్చారి మానవస్వభావాన్ని పరిశీలించడం, అన్నిటికన్నా, ఆమెకు ఇష్టమైన విషయం తనతో చదువుకున్న అమ్మాయిలు, ఫాషనబుల్గా డ్రెస్‌చేసుకోవడం, వీలైనంత జల్సాజీవితం గడపడం, మంచి మొగుడికోసం కలలు కనడం తప్ప జీవితంలో వేరే ఏమీ కోరదగినది లేనట్లుండేవారు బరువైన ఆలోచనలకి వాళ్లు దూరంగా నిల్చొని, తమకి వద్దని తోసిపారేసేవారు వాళ్ల సంభాషణల్లో, ఎంతసేపూ 'వాళ్ల వెనకాల తిరిగే అబ్బాయిలూ, వాళ్ల లవ్ లెటర్స్' ప్రాధాన్యత వహించేవి

అంతమంది స్నేహితుల్లో ఒకరిదీ లోతైన స్వభావం కన్పించలేదు—ఒక్క సురయా బీగం అనే అమ్మాయిది తప్ప కానీ, ఏం లాభం ? సురయా తల్లి పతితురాలు అని వినికిడి వాళ్లకు డబ్బులేదు సురయా, చాలా తెలివైనది ఎన్నో పుస్తకాలు చదివింది ఎంతో బాగా మాట్లాడేది మానవ స్వభావం గురించి చాలా లోతుగా తరచి చూచినట్లు మాట్లాడేది వాసంతికి ఇంటర్ ఫస్టియర్లో సురయా అంటే చెప్పలేనంత అభిమానం. ఇద్దరూ గంటలతరబడి మాట్లాడేవారు అసలు వాసంతిలో ఎక్కువగా మార్పురావడానికి సురయాయే కారణం వాసంతి మనస్సుని, ఆదర్శ శిఖరాలకి, హృదయపు లోతుల్లోకి, భావనా ప్రపంచపుటంచుల్లోకీ సురయాయే తీసుకువెళ్లింది మనుష్యులను అర్థం చేసుకోడంలోగల విశిష్టతను ఆమెకు సురయాయే బోధపరచింది క్లాసులో కూడా సురయాదే ఫస్టుమార్కు వాసంతీ, సురయా ఎన్నో నెలలు ఒకర్నొకరు విడవకుండా తిరిగి, ఏవో విషయాలు చర్చించేవారు సురయా, ఖొరాను చదివింది బైబిలు చదివింది భగవద్గీత కూడా చదివింది వాటిల్లో విషయాలుకూడా వాసంతికి చెప్పేది

అటువంటి సురయా, పరీక్షలముందు రామారావు అనే అబ్బాయితో హఠాత్తుగా లేచిపోయింది వాసంతికి సురయా అలా ఎందుకు పారిపోయిందో అర్థంకాలేదు రెండు మూడు రోజులు వాసంతికేమీ తోచలేదు తరువాత ఆమె మళ్లీ మామూలు ప్రపంచంలోకి వచ్చి, పరీక్షలకు గట్టిగా చదివి పాసయ్యింది సురయాను మర్చిపో ప్రయత్నించినా, ఆమెభావాలు మర్చిపోలేక పోయింది

చంద్రమౌళి మాటల్లోకూడా అప్పుడప్పుడు సురయా భావాలు గోచరిస్తూండేవి వాసంతికి వాసంతికి చంద్రమౌళిది పిచ్చిధోరణి అనిపించేది కాదు జీవితంలో అనేక సంఘటనల్నీ, వ్యక్తుల్నీ చూసి ఏర్పరచుకున్న భావాలులా ఉండేవి అతని మాటలు అయితే సురయా వేదాంతధోరణితో వాటిని పట్టించుకొనేది కాదు చంద్రమౌళి మాత్రం వాటన్నిటినీ తనమనస్సుకు పట్టించుకుని, ఆ వ్యక్తులకోసం బాధపడి తనబుర్ర పాడు చేసుకుంటున్నాడు సురయాది ఒమర్‌ఖయ్యాం తత్వం చంద్రమౌళిది అలా, 'ప్రపంచాన్ని దాని మానాన్న అది ఉండనిమ్మని వదిలేసి, మనం సుఖంగా ఉందాం' అనే తత్వం కాదు, పోనీ అని, నిర్మాణాత్మక దృక్పథంతో సంఘానికి సేవా చెయ్య లేదు అందుకే అతనికి మతి పోయింది డాక్టరు

గారు, "తన శక్తికి మించిన ఆలోచనలు చేస్తూ ఉమ్మా అతను" అన్నారు వాసంతితో

వాసంతి చంద్రమౌళి నర్థం చేసుకోడానికి ప్రయత్నించా లనుకొంది వయస్సులోనూ, అనుభవంలోనూ చిన్నదైనా, స్త్రీగా, తనకొక పురుషుడిమీద, గట్టి ప్రభావం చూపించగలనని ఆమెకు తెలుసు చంద్రమౌళి తనమీద చూపించే శ్రద్ధా, తనతో మాట్లాడేటప్పుడు అతని మాటల్లోవుండే మార్దవం ఆమె కనిపెట్టింది తనింకా ప్రోత్సాహమిస్తే అతను పూర్తిగా తనతో అతని మనోవ్యధనంతా చెప్పుకొని మానసికంగా ఆరోగ్యవంతుడు కావచ్చుననుకొంది ఇది కేవలం ఒక ప్రయోగంలా చేసి చూడదలచింది చంద్రమౌళి ఆరోగ్యవంతుడైతే అతని తలిదండ్రు లెంతో నంతోషిస్తారు

డాక్టరుగారు కూడా చంద్రమౌళి నారోగ్యవంతుణ్ణి చెయ్యాలని చాలా ప్రయత్నిస్తున్నారు అతనితో ఎంతో జాలిగా, ప్రేమగా మాట్లాడే వారు "చూడండి, చంద్రమౌళిగారూ ! మనం కూడా యంత్రాల్లాంటివాళ్లమే యంత్రాల లాగానే మన మెదడుకూడా పరిమితమైన శక్తి కలది మాత్రమే అనవసరంగా దానిని శ్రమ పెట్ట కూడదు మనకు అలవిగాని ఆలోచనల్ని మనం దూరంగా ఉంచాలి పైగా వాటిని గురించి ఆలోచించి ప్రయోజనం ఏముంది ? కాబట్టి మీరు వాటి గురించి ఆలోచించవద్దు మనస్సుకు బాగా విశ్రాంతి నివ్వండి" అని చెప్పేవారు చంద్రమౌళి ఆయన చెప్పిందంతా శ్రద్ధగా వినేవాడు

"డాక్టరుగారూ ! మీరు చెప్పినట్లు చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాను కానీ, నాలో ఉన్న ముఖ్యలోపం నా మెదడు నా 'కంట్రోలు' లో ఉండదు ఏం చెయ్యమంటారు ? అయినా మీరు చెప్పినట్లు ప్రయత్నిస్తాను" అనేవాడు

* * *

ఒకనాడు సాయంకాలం వాసంతీ, జమునా షికారు బయలుదేరారు వాళ్లు కొంతదూరం వెళ్లేసరికి వాన పట్టుకుంది ఆకాశంలో హఠాత్తుగా మబ్బులువేసి వాన కురవడం ప్రారంభించింది వాళ్లకు తలదాచుకోవడ మెలాగా అని భయమేసింది అదృష్టవశాత్తు ఎక్కడికక్క దగ్గరలోనే సుదర్శనంగారిల్లు ఉంది అక్కా చెల్లెళ్లిద్దరూ త్వరత్వరగా వారింట్లో కెళ్లారు సుదర్శనంగా రింట్లో లేరు చంద్రమౌళి తన గదిలో కూచొని చదువుకుంటున్నాడు సుదర్శనంగారి భార్య సీతమ్మ, వీరిని లోపలికి రమ్మని ఆహ్వానించింది వానలో కొద్దిగా తడిసారని, పెట్లోంచి చీరలూ, జాకెట్లూ తీసి కట్టుకోమని ఇచ్చింది బయట వాన ఎడతెరపిలేకుండా కురవసాగింది

చంద్రమౌళికి వాసంతీ, జమునా వచ్చారనీ తెలిసి వాళ్లను తనగదిలోకి రమ్మని నౌకరుతో కబురు పెట్టాడు కొంతసేపు సీతమ్మగారితో మాట్లాడాక వాళ్లిద్దరూ చంద్రమౌళి గదిలోకి వచ్చారు

"రండి రండి బయట జోరుగా వాన కురుస్తూంటే ఇవాళ ఎలాగా గడపడం అని ఆలోచిస్తున్నా మీరు వచ్చారు గనక ఆ సమస్య తీరిపోయింది" అని వారిని ఆహ్వానించాడు వాసంతీ, జమునా అతని గదిని పరిశీలనగా చూడ నారంభించారు మంచి సోఫాలు, బీరువాలూ, రెండు అద్దాలబీరువాలనిండా పుస్తకాలూ, గోడల నిండా ప్రసిద్ధ చిత్రకారుల ఆయిల్ పెయింటింగ్సూ, బేటరీమీద నడిచే పెద్ద రేడియో, ఒక మూలగా టేబిలూ, రెండు కుర్చీలూ, మొత్తం మీద సంపదనీ, అభిరుచిని చాటుతోంది, అతని గది ఇద్దరూ అతని కెదురుగుండా కూర్చొని మాట్లాడసాగారు

---

ఒకవూళ్లో నాటకం మొదలు పెడతారనగా ఆ సమయానికి ఒక నటుడు రాలేదు ఆ నాటకం కింపెనీవాళ్ళు ఆ నటుడు రాక పోవటంవల్ల కొత్త నాటక లాడటం చేతయిన ఒక హోటలుకన్ని ఆపాత్రకేఉండమన్నారు నాటకం మొదలుబెట్టారు ఆ సర్వరుకి నాటకం కొత్తగాబట్టి కొత్త కునుకుపట్టింది అప్పుడు కృష్ణుడు వచ్చి 'బావా ని సందేశమేమిటి?' అన్నాడు. అతడు వెంటనే 'ఆ ఏముంది యిడ్లీ 7 న పై మినపట్ 13న పై, కాఫీ,' అని చెప్పబోతున్నాడు ఈ మాటలు విని ప్రేక్షకులందరుగొల్లున నవ్వారు. అప్పటికిగాని తెలియలేదు, అతడికి తను ఒకపాత్ర నిర్వహిస్తున్నాడని.

మాచిరాజు కిరణ్‌కుమార్ (బపట్ల)

---

"మీకు మంచి మంచి బొమ్మలంటే ఇష్టమా ?" అని అడిగింది వాసంతి, గోడనున్న ఆయిల్ పెయింటింగ్సు చూస్తూ

చంద్రమౌళి ఆమె ఆ చిత్రాల్ని పరిశీలించడం చూసి ఈ "చిత్రాలని చూసి నాకు బొమ్మలంటే ఇష్టం అనుకోవద్దు ఈ పెయింటింగ్సు వెనకాల ఒక చిత్రమైన గాథ ఉంది ఒక స్నేహితుడికి అత్యవసరంగా డబ్బు కావలసివచ్చింది అతని దగ్గర ఇవితప్ప అమ్మడానికి మరేవీ లేవు ఇవి కొనడానికి నేను సిద్ధపడ్డాను, అతని పరిస్థితి చూసి. వాకు వాటిని అమ్మేశాడు నేను మళ్లీ వాటిని అతని కిచ్చేద్దా మనుకున్నాను గాని, అతనికి వాటిమీద శ్రద్ధలేదు ఇవన్నీ వాళ్ల తండ్రి హయాములో సంపాదించినవి

"డబ్బుంటే ఎలాటి అపురూప వస్తువులైనా సంపాదించచ్చు" అంది జమున వాసంతి నవ్వింది

"అవును కాని, డబ్బుంటే కొన్ని అపురూపవు కష్టాలుగూడా సులభంగా వచ్చి మెడకు చుట్టుకుంటాయి నిజానికి డబ్బంత పాపిష్టిది మరొకటి లేదు అది ఎన్ని అకార్యాలనైనా చేయిస్తుంది" అన్నాడు చంద్రమౌళి జమున ఒప్పుకోలేదు

"అలా అని అందరూ అంటారు కాని అందరూ అలాగుంటారా ?"

"ఉండడం, ఉండకపోవడం వాళ్లవాళ్ల తత్వాల మీద ఆధారపడి ఉంటుంది కాని డబ్బుకు మాత్రం ఆశక్తి ఉంది" అన్నాడు చంద్రమౌళి ఆ విషయాన్ని అక్కా చెల్లెళ్లిద్దరూ అంగీకరించినట్లు మౌనం దాల్చేరు చంద్రమౌళి కూడా కిటికీ అద్దంలోంచి కనిపిస్తున్న వానను చూస్తూ కాసేపు ఊరుకున్నాడు

వాన విపరీతంగా కురుస్తోంది ఉరుములూ, మెరుపులూ పెద్ద ఆర్భాటం చేస్తున్నాయి పెద్ద తుఫాను చెలరేగినట్లుంది నౌకరు ముగ్గురికీ కాఫీ తెచ్చాడు ముగ్గురూ త్రాగారు వాసంతీ, జమునా వానఉధృతం చూసి 'చీకటిపడిపోయింది ఇంటి కెలాగ వెళ్లడమా' అని ఆలోచించారు వాన తగ్గే సూచనలేమీ కన్పించటంలేదు

చంద్రమౌళి, వాళ్ల ఖంగారు గమనించి "మీ రిక్కడ ఉన్నట్టు మీ ఇంటికి ఈపాటికి కబురు వెళ్ళి ఉంటుంది మీరేమీ ఖంగారుపడ నక్కరలేదు మీ ఇల్లెంతో మా ఇల్లంతే" అన్నాడు

వాసంతి, "అబ్బే, అందుకు కాదండీ వాన ఇంత విపరీతంగా కురుస్తోందే ఈ గాలికీ, వానకీ, చిన్న చిన్న పూరికొంప లెన్ని కూలిపోతాయో అనిపిస్తోంది" అంది

"లెక్కలేనన్ని కూలిపోతాయి చాలామంది బీద జనం ఆశ్రయంలేక అల్లాడిపోతారు మన దేశంలో అనేక నదులున్నాయి వాటివల్ల దేశంలో చాలా పొలాలు సుభిక్షమైన పంటను పరిడిస్తాయి కానీ వాటికి వరదలు వచ్చినప్పుడు, ఎందరు ప్రాణాలు పోగొట్టుకుంటారో, ఎన్ని గ్రామాలు కొట్టుకుపోతాయో, ఎంతమంది అనాధలై పోతారో ఆలోచించండి అంతమంది అలా, ఆకలితో, చలితో, అటమటించిపోతూంటే మనం దిట్టమైన కొంపల్లో హాయిగా ఉండడం ఎంతో పాపమనిపిస్తుంది" అన్నాడు చంద్రమౌళి

"భగవంతుడి సృష్టే అలాగుంటే దానికి మనమేం చేయగలం ?" అంది జమున వాసంతి జమునతో ఏకీభవించలేదు

"ఎందుకు చెయ్యలేం మనకోసం మనం ఎన్ని చేసుకుంటున్నాం 'భగవంతుడి సృష్టి' అనుకొని పుట్టినవాళ్లం పుట్టినట్లు ఉండిపోతున్నామా ? ఎక్కువ సుఖాన్నీ, ఎక్కువ ఆనందాన్నీ పొందడానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాం మనకున్న అవకాశాలు మనం వినియోగించుకుంటున్నాం కొద్దిగా మన అవకాశాల్ని వాళ్లకుకూడా పంచి ఇస్తే వాళ్ళూ మనలాగే పైకివస్తారు" అంది వాసంతి

చంద్రమౌళి వాసంతివేపు గౌరవంగా చూశాడు వాసంతి తను చెప్పిన మాటల్ని తను ఎంతో ముఖ్యమైనవని విశ్వసిస్తున్నట్లుగా ముఖంపెట్టింది జమున, అక్క చెప్పిన మాటల్లో సత్యాన్ని గుర్తించింది

"మరి నీలా ఆలోచించేవాళ్లంతా, వాళ్ల నెందుకు ఉద్ధరించలేక పోతున్నారు ?" అని జమున ఒక అడ్డసవాలు వేసింది

"ఎందుకు చెయ్యటంలేదు చేసేవాళ్లు చేస్తూనే ఉన్నారు" అంది వాసంతి

చంద్రమౌళి "లేదు వాసంతీ నువ్వు పొరబడుతున్నావు వాళ్లకు సాయంచెయ్యడంకూడా సులభంకాదు వాళ్ల గురించి బాధపడేవాళ్లనేకమంది ఉన్నారు కాని వాళ్లకున్న శక్తి చాలా తక్కువ ధనికు లెంతసేపూ తమ ధనాన్ని భద్రంగా కాపాడుకోవడంకోసం బీదవాళ్లని బీదరికంలోనూ, బాధల్లోనే ఉంచే విధానం ఆలోచిస్తూంటారు వాళ్లకున్న శక్తి, అధికారంతో వాళ్లు తక్కినవాళ్లని ఏ మంచిపనీ చెయ్యనియ్యరు అందువల్ల బీదలస్థితి ఎప్పటికీ ఒకలాగే ఉంది మనం బీదవాళ్లని చూసి జాలిపడతాం వాళ్లకోసం కన్నీళ్లు విడుస్తాం కాని మనస్థితి పంజరంలోని చిలకలా ఉంది మనచుట్టూ ధనికులు నిర్మించిన పంజరం ఉంది" అన్నాడు

వాసంతి "అయితే ధనికుల్లో మానవత్వమే కొరతవడిందన్నమాట ఎందుకంటే మానవత్వం ఉన్నవా డెవడూ, తన తోటిమానవుడికి అంత అపకారం చెయ్యలేడు" అంది చంద్రమౌళి అవునన్నట్లు తలూపాడు జమునకూడా అతని మాటలలోని సత్యాన్ని ఆలోచిస్తూ కూచుంది

బయట వాన బాగా ఎక్కువగా కురుస్తోంది గాలి పెద్ద హోరుతో వీస్తోంది సీతమ్మగారు, వాసంతినీ, జముననూ ఆ రాత్రికి అక్కడే ఉండి పొమ్మన్నారు పొరుగూరు వెళ్లిన సుదర్శనంగారు రాలేదు

వాసంతీ, జమునా ఇష్టపడకపోయినా, గాలి వాన ఎక్కువగా ఉండడంవల్లా, సీతమ్మగారి బలవంతంవల్లా ఆ రాత్రికి అక్కడ ఉండక తప్పలేదు భోజనంచేసిన తరువాత సీతమ్మగారి గదిలోనే వాళ్లిద్దరకూ నౌకర్లు మంచాలూ, పక్కలూ వేశారు ముగ్గురూ పడుకున్నారు చంద్రమౌళి ముందుగానే తన గదిలోకి పాలూ, రొట్టె తెప్పించుకొన్నాడు అతను రాత్రి, మామూలు భోజనం చెయ్యడు పాలూ, రొట్టె మాత్రమే తీసుకుంటాడు

పక్కమీద పడుకొన్న కొద్దిసేపటిలోనే జమునకు నిద్రపట్టేసింది, వాసంతికి నిద్రపట్టలేదు సీతమ్మగారుకూడా నిద్రపోయారు వాసంతికి రాత్రి పడుకోబోయేముందు ఏదైనా పుస్తకం చదువుతూ నిద్రపోవడం అలవాటు ఆమె చంద్రమౌళి నడిగి ఏదైనా పుస్తకం తీసుకోవడం మర్చిపోయింది వాళ్లు పడుకున్నగదిలో ఏ పుస్తకాలూ లేవు.

కొంతసేపటి వరకూ చంద్రమౌళి గురించి ఆలోచిస్తూ గడిపింది. చంద్రమౌళి సహజంగా ఎంతో మంచివాడూ, తెలివైనవాడు అతనిలో ఉన్న లోపమల్లా దేనిగురించైనా అతిగా ఆలోచించడమే కాని, అది అతని స్వభావంలో ఒక భాగం మెత్తని మనస్సు కలవాళ్లు ప్రతి విషయం గురించీ అతిగా బాధపడక తప్పదు ఇతరులు ఎంత చెప్పినా వాళ్లు వినలేరు

వాసంతి బుర్రలో ఎన్నో ఆలోచనలు దొర్లాయి బయట భయంకరంగా వీస్తున్న గాలి, కుంభవృష్టిగా కురుస్తున్న వర్షం, ఆ రాత్రితో ఈ ప్రపంచపు అంతేదో తేల్చడానికి నిశ్చయించుకున్నాయేమో! ననిపిస్తోంది హఠాత్తుగా ఆ యిల్లే కూలిపోయి తమ మీద పడితే ? తామంతా మరణిస్తారు అప్పుడు తనూ, తన తలిదండ్రులూ వీళ్లంతా ఒకరికొకరు సంబంధంలేకుండా నశిస్తారు మరణం గురించీ, యమలోకం గురించీ ఆలోచిస్తే ఏదో భయం వేస్తోంది వాసంతికి

పిచ్చిపిచ్చి ఆలోచనలన్నీ మర్చిపోవడానికి, ఏదైనా పుస్తకం దొరికితే బాగుణ్ణనిపించింది జమునా, సీతమ్మగారూ ఇద్దరూ నిశ్చింతగా నిద్రపోతున్నారు వాసంతి మెల్లిగా లేచి గది బయటకు వచ్చింది వరండా దాటి చంద్రమౌళి గది దగ్గరకు వెళ్లింది

---

తెలుగు మేష్టారు—(పాఠం చెబుతూ) "అంతెటా మహారాణి అవ్వానమునందు ఒకసింహామును కని

విద్యార్థి -మేష్టారూ ! మహారాణులకు సింహాలుపుట్టేవాండీ?

మందలపర్తి భుజంగరావు (భీమవరం)

---

చంద్రమౌళి గదిలో లైటు వెలుగుతోంది

చంద్రమౌళి కిటికీదగ్గర నుల్చొని, బయట కురుస్తున్న వానను చూస్తున్నాడు వాసంతి రావడాన్ని అతను గమనించలేదు

ముందు ఏదైనా పుస్తకం తీసుకొని, చప్పుడు చెయ్యకుండా వెళ్లిపోదామనుకొంది వాసంతి కానిచంద్రమౌళి కిటికీ దగ్గర నిల్చోడం, తను రావడం కూడా గమనించకపోవడం చూసి, అతన్ని అనవసరంగా ఆలోచించవద్దనీ, నిద్రపొమ్మనీ చెబుదామనుకొంది

చంద్రమౌళికి దగ్గరగా కొంచెం చప్పుడు చేసుకుంటూ వెళ్లింది

అత నిటు తిరగలేదు

"ఏమండీ !" అని పిల్చింది

చంద్రమౌళి ఇటు తిరిగాడు అతని మొహం శోకభూయిష్ఠంగా ఉంది వాసంతిని, ఎవరో కొత్త మనిషిని చూసినట్లు చూశాడు వాసంతికి కొంచెం భయం వేసింది మళ్లీ చంద్రమౌళి మొహం కిటికీవైపు తిప్పేసుకున్నాడు వాసంతికి అతని పరిస్థితి అర్థమైంది తనకూ, అతనికీ పరిచయమైన దగ్గర్నుంచీ, అత నెన్నడూ అలా ఉండలేదు వాసంతి తిరిగి వెళ్లిపోదామా అని ఆలోచించింది.

ఆమె మనస్సులోంచి ధైర్యం, ఒక పొంగు పొంగింది

చంద్రమౌళి భుజంమీద చెయ్యి వేసింది "ఇటు చూడండి !"

చంద్రమౌళి చంటిపిల్లాడిలా ఏడుస్తున్నాడు

వాసంతి అతని చెయ్యి పట్టుకుని "ఇలా రండి!" అని అతన్ని మంచం దగ్గరికి తీసికెళ్లింది మంచంమీద యాంత్రికంగా కూచున్నాడు కళ్లమ్మట నీళ్లు కారుతూనే వాసంతి అతని కళ్లనీళ్లు తుడిచింది ఆమెకు, అత నంతవరకూ తను చెప్పినట్లు వినడంతో మరింత ధైర్యం వచ్చింది

బయట ఒక మెరుపు మెరిసింది మేఘం గర్జించింది

వాసంతికి, తరువాత ఏం చెయ్యాలో తోచలేదు ఒక్క నిముషం తనూ బయట కురుస్తున్న వానవైపు చూసింది మళ్లీ చంద్రమౌళివైపు చూసింది చంద్రమౌళి తనవైపే తదేకదీక్షగా చూస్తున్నాడు

వాసంతికి, అతను తనవైపు అలా చూడడం కొంచెం సిగ్గేసింది

ఆమె మనస్సులో చిన్న కెరటంలా—అర్ధరాత్రి—తా మిద్దరూ ఏకాంతంగా—ఒక గదిలో ఉన్నామనే భావం వచ్చింది

వెంటనే, కర్తవ్యం తోచినదానిలా "మీరు పడుకోండి" అంది

అతను, ఆమెవైపు అర్థంకానట్లు చూశాడు

అతని భుజం పట్టుకొని "ఊఁ! పడుకోవాలి" అంది రోగిని ఆజ్ఞాపించే ధోరణిలో అతని తల తలగడామీద ఉండేట్లు చేసింది

"కళ్లు మూసుకోండి" అంది అతను కళ్లు ముయ్యలేదు అతనిమీద దుప్పటి కప్పింది కంఠందాకా అతని కళ్లవైపు చూసింది అవి ఇప్పుడు కన్నీళ్లు కార్చటంలేదు ఆమెవేపు వింతగా చూస్తున్నాయి

తను అతని తలదగ్గర కూచొంది అతని నుదురు రాస్తూ మాట్లాడసాగింది "ఇంత రాత్రివరకూ మీ రెందుకు మేల్కొన్నారు ? పైగా మీరిలా మేల్కొంటారని మీ అమ్మగారికి తెలియదులా ఉంది అయినా ఎందు కొచ్చిన ఆలోచన లివి ? ఆరోగ్యం పాడుచేసుకొనేదాకా, ఆలోచించాలా ? మీరెన్నో పుస్తకాలు చదివారు ఎంతో తెలివైనవారు ఒక మనిషి తనని తాను, శారీరకంగానూ, మానసికంగానూ పటిష్ఠం చేసుకున్న తరువాతే ఇతరుల్ని ఉద్ధరించగలడు తన మానసిక శక్తిని కోల్పోతే, ఆ వ్యక్తి ఏం చెయ్యగలుగుతాడు ?" వాసంతి అతని నుదురు రాయటం ఆపి, అతని మొహంవైపు చూసింది

చంద్రమౌళి నిద్రపోతున్నాడు వాసంతి, అతని మొహం బాగా పరిశీలించిచూసి ఒక నిట్టూర్పు విడచింది మెల్లిగా లేచింది బయట కొంచెం తగ్గిన వానవేపు చూసింది మెల్లిగా అడుగులేసుకుంటూ తను పడుకున్న గదిలోకి వెళ్లిపోయింది తీరా తన పక్కదగ్గరికి వెళ్లాక ఆమెకు—తను ఏ పుస్తకం తెచ్చుకోలేదని జ్ఞాపకమొచ్చింది తన మతిమరుపుకు, చిన్న నవ్వు నవ్వుకొంది పక్కమీద పడుకొని ఆవలిస్తూ దుప్పటి తన

మీదికి లాగుకొంది సీతమ్మగారూ, జమునా నిశ్చింతగా నిద్రపోతున్నారు

ప్రొద్దున్నే లేచి వాసంతీ, జమునా కాఫీ తాగాక ఇంటికి బయల్దేరారు వాన బాగా తెరిపిచ్చింది చంద్రమౌళి నిద్రనుంచి ఇంకా లేవలేదు

రాత్రంతా కురిసిన వానకి, నీరు పొలాల నిండా నిండిపోయింది గాలికి బోలెడుచెట్లు పడిపోయాయి ఆ భీభత్సమంతా చూస్తూ జమునా వాసంతీ యింటి కెళ్లారు ఇంటి కెళ్లగానే డాక్టరుగారూ, ఆయన భార్యా "ఏమ్మరా ? మంచి పని చేశారు సుదర్శనంగారి నౌకరు వచ్చి చెప్పే దాకా మీ గురించి ఎంతో బెంగపెట్టుకున్నాం" అన్నారు వాసంతి తను రాత్రి చంద్రమౌళిని నిద్ర పుచ్చినవిషయం తప్ప తక్కిన విషయాలన్నీ చెప్పింది

పొద్దున్న పదిగంట లయ్యేటప్పటికి వాన పూర్తిగా తగ్గిపోయింది వాసంతికి, అవాళ పోస్టులో ఎం బి బి ఎస్ లో సీటు వచ్చినట్లూ, పది రోజులలో వచ్చి 'జాయిన' వ్వాలనీ ఉత్తరం వచ్చింది తానొక నూత్నజీవితంలోకి అడుగుపెట్టబో తున్నట్లు, ఉత్సాహం పొందింది

అవాళ సాయంకాలం చంద్రమౌళి డాక్టరుగారింటికి వచ్చాడు డాక్టరుగారితో చాలాసేపు మాట్లాడుతూ కూర్చున్నాడు అతను వెళ్లి పోయాక వాసంతి తండ్రి దగ్గరకు వచ్చింది ఆమెకు చంద్రమౌళిలో ఏదైనా మార్పుందేమో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది

డాక్టరుగారు కూతుర్ని చూసి "ఏమమ్మా, ఇవాళ చంద్రమౌళితో వచ్చి మాట్లాడలేదేం ?" అని అడిగారు వాసంతికి 'గతుక్కు'మన్న ట్లయింది మనసులో

"అబ్బే ! ఏంలేదు సుశీలా, నేనూ బట్టలు కత్తిరిస్తూ లోపలుండిపోయాం ఆయ నేమైనా అన్నారా ?" అంది తన మనస్సులో ఉన్న ఆందోళన వ్యక్తం చెయ్యకుండా

అదేమీలేదు చంద్రమౌళి ఇవాళ కొద్దిగా ఉత్సాహంగా ఉన్నాడు అలాంటప్పుడు అతనితో మాట్లాడటం సరదాగా ఉంటుంది" అన్నా రాయన

వాసంతి సంతృప్తిగా ఊపిరి పీల్చుకుంది

మర్నాడు బాగా ఎండ వచ్చింది ముగ్గు రక్కచెల్లెళ్ళూ సాయంకాలం షికారుకు బయల్దేరారు వాళ్లతో నౌకరుకుర్రాణ్ణి కూడా వెంటబెట్టుకు వెళ్లారు. చంద్రమౌళి వాళ్లకు ఎదురొచ్చాడు వాసంతి అతన్నికూడా వాళ్లతో షికారు రమ్మంది అతనూ వాళ్ల ననుసరించాడు

జమునా, సుశీలా, ఇద్దరికీ వాసంతిమీద చంద్రమౌళికి ప్రత్యేకాభిమానం అని తెలుసుకాబట్టి, వాళ్ళిద్దర్నీ వెనక్కి వదిలేసి, తాము కొంచెం ముందుగా నడవనారంభించారు వాసంతి చంద్రమౌళిని ముందు వాళ్లనాన్నగారు గాలివాన రోజున ఎక్కడికి వెళ్లిందీ, ఎప్పు డింటికి వచ్చిందీ అడిగింది

చంద్రమౌళి ఆమె మాటలకు జవాబు చెప్పి "వాసంతి నేను నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలని వచ్చాను" అన్నాడు వాసంతి అతని

# వాసంతి

మొహంలోకి చూసింది

"ఏమిటది ?" అని అడిగింది

'నాలో ఏదైనా మార్పు వచ్చినట్లు కనిపిస్తోందా ? నీకు "

"ఏమో నాకు తెలియదు."

"అలా కాదు వాసంతి నువ్వు సమాధానం చెప్పాలి"

"నేనేం చెప్పగలను ?"

"నా అంతట నాకు చాలా మార్పు కన్పిస్తోంది నా మనస్సు వెనక, పగిలిన గాజుగ్లాసులా ఉండేది అందులో ఏది పోసినా కారిపోయేది ఇప్పు డలా కాకుండా, ఎవరో దాన్ని చక్కగా అతికించినట్లూ, అందులో ఏదైనా ఇమిడేటట్లూ ఉంది నాకు మళ్లీ చదువుకోవాలనిపిస్తోంది ఇంత మార్పు ఎలా వచ్చిందో బోధపడటంలేదు" అన్నాడు చంద్రమౌళి

"చాలా సంతోషం అదేగా కావలసింది! మీరు మళ్లీ చదువుకు వెళ్లినాకూడా నేను చాలా

ఒకరు:-పిచ్చాసుపత్రికి కాలేజీకి భేద మేమిటి?

మరొకరు:- పిచ్చాసుపత్రి నుండి బయటకు రావాలంటే మనిషిలో చాలా అభివృద్ధి కన్పించాలి.

యస్. యన్ మురుయా
(కోవూరు)

సంతోషిస్తాను అసలు మీకింత విచారం కలిగించిన విషయమేమిటో నాకు తెలుసుకోవాలని ఉంది"

"అది చాలా పెద్ద కథలే ఎప్పుడైనా చెబుతాను" అన్నాడు చంద్రమౌళి కొంచెం విచారంగా వాసంతికి ఆ విషయం కదపడం తను పొరబాటుచేశా ననిపించింది చంద్రమౌళి కొంచెం సేపు మౌనం వహించి తరువాత మాట్లాడాడు

"జీవితంలో అపురూపంగా మంచి స్నేహం లభిస్తుంది ఈ ఊరికి రెండేళ్లక్రిందట నేను భగ్నహృదయంతో వచ్చినప్పుడు ఏనాడైనా నీలాటి వ్యక్తి కన్పిస్తుందనుకోలేదు ఈ రెండేళ్లూ నా మనసు, మనసులోలేక నానాయాతనా అనుభవించాను నాయందు సానుభూతిచూపించేవా రెవరూ నా కింతవరకూ కన్పించలేదు నీతో పరిచయమైన ఈ అయిదారు వారాల్లోనూ నా కెంత మనశ్శాంతి లభించింది నీకు నామీద ఏదో ప్రత్యేక అభిమానం ఉన్నట్లు తోస్తోంది నీ స్నేహం, సానుభూతి నాకు ఎల్లప్పుడూ కావాలి అందుకోసమే నిన్ను ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

వాసంతి చిన్న నవ్వు నవ్వింది "ఇందులో పెద్ద విశేష మేముంది ? మీరు ఎంతో మంచివారు కాబట్టే నేను మీతో స్నేహంచెయ్యగలిగాను నా సానుభూతి మీమీద ఎల్లప్పుడూ ఉంటుంది" అంది ముందు వెళ్తున్న జమునా, సుశీలలకి నౌకరుకుర్రాడు వేరుశెనగకాయల్ని మొక్కల్తో సహా పొలాల్లోంచి పీకి తంపడేసి పెట్టున్నాడు వాళ్ళు సరదాగా ఆ ఉడికినకాయల్లోని పప్పు తినుకు తింటున్నారు

చంద్రమౌళి, వాసంతి ఒకచోట కూర్చొని ఉడికిన వేరుశనగకాయల పప్పును తిననారంభించారు చంద్రమౌళి, వాసంతి ఎం బి బి ఎస్ కు వెళ్తోందని సంతోషించాడు వాసంతి "మీరు కూడా ఎం ఏ కు కట్టి పూర్తిచెయ్యరాదా ?" అని అడిగింది చంద్రమౌళిని

"నేను ఆ ఉద్దేశంతోనే ఉన్నాను మా అమ్మగారు నన్ను వదిలి ఉండడానికి ఇష్టపడటంలేదు ఆమెవంట్లో ఆరోగ్యం బాగాలేదు అందుకని సందేహిస్తున్నాను ఈ సంవత్సరం కాకపోతే వచ్చే సంవత్సరమైనా చేర్తాను" అన్నాడు

వాసంతి అతనివైపు చూస్తూ "మీరు నాకొక వాగ్దాన మివ్వాలి?" అంది

"ఏమిటది ?"

"నేను చదువుకు వెళ్లిపోయినా, మీ గురించే ఆలోచిస్తూ ఉంటాను మీరు అతిగా దేని గురించీ ఆలోచించవనీ, రాత్రిళ్ళు తొందరగా నిద్రపోతానని, నాకు వాగ్దానమిస్తే నేను నిశ్చింతగా వుండగలను"

"అలాగే" అని, చంద్రమౌళి మెల్లిగా అంటూంటే అతనికళ్లల్లో నీళ్లు నిలచాయి వాసంతి గమనించలేదు చంద్రమౌళి ఆమెకు తన మొహం కన్పించకుండా తిప్పేసుకున్నాడు జమునా, సుశీల వచ్చి ఇంటికి వెళ్దామన్నారు

అందరూ కలిసి డాక్టరుగారింటికి చేరుకున్నారు దారిలో ఎవరూ ఏమీ మాట్లాడలేదు వాళ్లను దిగబెట్టి, చంద్రమౌళి తనింటికి వెళ్లిపోతూ వాసంతియొక్క మంచితనంగురించి ఆలోచించాడు తన గురించి ఆమె చూపించే ఆత్రుతా, అభిమానం తనింతవరకూ ఎవరిదగ్గరా చూడలేదు. ఆమెలో ఏ ప్రబలమైన ఆకర్షణో, తన కల్లోలితమనస్సును చక్కబరుస్తోంది తనకు మునుపులేని ధైర్యాన్నిస్తోంది వాసంతి తనకన్నా చిన్నదైనా, ఆమె ఆలోచనలు తన ఆలోచనలకన్నా తెలివైనవిలా కన్పిస్తాయి ఆమె దయార్ద్రహృదయాన్ని తల్చుకుంటే, తన మనస్సే కరిగిపోతుంది

చంద్రమౌళి అవాళరాత్రి ఇంటికి చేరుకున్న తరువాత తల్లితో తను మళ్లీ చదువుకు వెళ్తానని చెప్పాడు తండ్రికూడా విన్నాడు అతను చెప్పడం. ఆయనకు కొడుకుని దూరంగా పంపించటం ఇష్టమే కాని తల్లికి ఇష్టంలేదు

సీతమ్మగారు కొడుకుమాట కేమీ జవాబు చెప్పలేదు భర్తతో కదిపింది సుదర్శనంగారు "వెళ్లనీ. ఈ రెండేళ్లబట్టీ వాడు ఆమాత్రమైనా ఉత్సాహం చూపించలేదు ఎలాగైనా మునుపటికన్నా వాడు కాస్త మారినట్లున్నాడు ఈమాటు జాగ్రత్తగా

చదువుకుంటాడేమో !" అన్నారు.

"ఇక్కడుంటే మన కళ్లముందర తిరుగు తున్నాడుకాబట్టి ఎలా ఉన్నాడో తెలుస్తోంది దూరదేశంలో ఉంటే మనకేం తెలుస్తుంది ?"

"వాడికి తోడుగా మన వీరయ్యనుకూడా పంపిద్దాం ఒకటి రెండు నెలలు ఉంటాడు సవ్యంగా నడిస్తే సరే, లేకపోతే ఇద్దరూ తిరిగి వచ్చేస్తారు ఇక్కడమాత్రం వాడి మనస్సుకు తగిన వ్యావృత్తి ఏది ?" అన్నారు

సీతమ్మగారు వాళ్లింట్లో పనిచేస్తున్న వీరయ్యను తోడిచ్చి పంపటానికి అంగీకరించారు వాసంతి ఎం బి బి ఎస్ లో చేరటానికి వెళ్లిన కొద్ది రోజుల్లోనే చంద్రమౌళి ఢిల్లీకి, ఎం ఏ రెండో సంవత్సరంలో చేరడానికి వెళ్లిపోయాడు

* * *

వాసంతికి ఢిల్లీనుంచి చంద్రమౌళి రెండుత్తరాలు రాశాడు అందులో తను కులాసాగా చేరి నట్లూ, వాసంతిని ఎప్పుడూ తల్చుకుంటున్నట్లూ రాశాడు తరువాత అతనిదగ్గరనుంచి ఉత్తరాలు లేవు వాసంతి కొంచెం ఆందోళన చెందింది కాని డాక్టరుగారు కూతుర్ని చూడడానికి విశాఖ పట్నం వచ్చినప్పుడు చంద్రమౌళి విషయం చెప్పారు

"చంద్రమౌళి ఢిల్లీకి వెళ్లిన రెండునెలల తరువాత, తల్లికి చాలా సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే వెంటనే బయల్దేరి తమగ్రామం వచ్చాడు అతను వచ్చేటప్పటికే తల్లి ప్రాణాలు విడిచేసింది పదిహేనురోజులదాకా ఉండి, ఒకనాడు తండ్రికికూడా చెప్పకుండా ఎక్కడికో వెళ్లి పోయాడు అప్పటినుంచీ అతనికోసం విశ్వ ప్రయత్నం చేశారుగాని కన్పించలేదు బహుశా ఏ దూరదేశాలకైనా పారిపోయాడో, లేక ప్రాణాలు పోగొట్టుకున్నాడో తెలియదు" అని డాక్టరుగారు చెప్పారు

ఈ మాటలు విని వాసంతి స్పృహతప్పిపడి పోయినంతపని అయింది డాక్టరుగారు ఖంగారుపడి ఆమెకు చెయ్యవలసిన సేవంతా చేశారు చాలా సేపటివరకు ఏడ్చింది డాక్టరుగారు ఆమె బాధ వర్ధం చేసుకున్నారు ఆయన, విషయం ఇంత వరకూ వెళ్తుందని ఊహించలేదు కూతుర్ని ఈ విషయంలో ఏమీ అని లాభంలేదని, మెల్లిగా ఆమెకు ధైర్యంచెప్పి, చంద్రమౌళి ఆచూకీ కను క్కోడానికి తనుకూడా ప్రయత్నం చేస్తానని చెప్పారు

ఆరేళ్ళ కాలగర్భంలో కలిసిపోయాయి

వాసంతి ఎం బి బి ఎస్ పూర్తవడం, ఒక ఏడాది 'హౌస్ సర్జన్' గా పనిచెయ్యడంకూడా అయిపోయి, విజయనగరంలో ప్రాక్టీసు పెట్టింది ఈ ఆరేళ్లలోనూ, అనేకసార్లు చంద్రమౌళి గురించి వాకబుచేసింది కాని అతనిజాడ ఏమీ తెలియలేదు డాక్టరుగారికి ఆ ఊరినుంచి, రెండు మూడు బదిలీలై రిక్టైరవబోతా రనగా ఆఊరే మళ్లీ వేశారు

* * *

డాక్టరు జానకిరాంకీ, సుదర్శనంగారికీ చాలా స్నేహం సుదర్శనంగారిని అన్ని కష్టాలలోనూ జానకిరాంగారే ఓదారుస్తూ ఉండేవారు చంద్రమౌళి సంగతి ఏమీ తెలియదు సుదర్శనంగారికి కూడా ఆరోగ్యం క్షీణించసాగింది భార్య చని పోవడం, కొడుకు మతిస్థిరంలేక దేశాలపాలైపోవడంతో ఆయన చాలావరకూ క్రుంగిపోయారు

ఒకనాటి మధ్యాహ్నం వాసంతి విజయనగరం నుంచి తండ్రిని చూడాలని బయల్దేరింది ఆ ఊరు వెళ్లాలంటే బస్సుమీద వెళ్లాలి

ఆమెకు ఆనాటి మధ్యాహ్నంనుంచి తండ్రిని చూడాలని అనిపించడంవల్ల, సాయంకాలం ఒకర్తే బస్సులో బయలుదేరింది విజయనగరంనుంచి ఇరవైమైళ్లదూరంలో ఆ పల్లెటూరు ఉంది ఆ పల్లెటూరికి వెళ్లి చాలాకాలమైంది

వాసంతికి ఆరుసంవత్సరాల తర్వాత మళ్లా ఆఊరు వెళ్లవలసి రావడం, ఆశ్చర్యంగా ఉంది సుదర్శనంగారెలాఉన్నారో ? చంద్రమౌళి సంగతే

---

ఒకరోజు రాత్రి ఒక నర్సుకు 'ఫోన్ కాల్' వచ్చింది.

అవతలి కంఠం.- ఏమండీ! మీ హాస్పటల్లో 8 వ నంబరు గదిలోని రోగికి ఎట్లా వుంది.

నర్సు:- బాగానే ఉంది.

అ. కంఠం:- అయితే అతన్ని ఎప్పుడు విడుదల చేస్తారు

నర్సు:- బహుశః సోమవారం. ఇంతకీ మాట్లాడేదెవరు?

అ. కంఠం:- మీ హాస్పిటల్లోని 8 వ నంబరు గదిలోని రోగిని.

సి. గోపాలకృష్ణ.

---

తెలియదు ! అతన్ని తల్చుకున్నపుడల్లా ఆమెకు కన్నీరు వస్తుంది ఆమె సాధారణంగా ఒకర్తే ప్రయాణం చెయ్యదు ఆనా డొందుచేతో, మనస్సు తండ్రిని చూడాలని కొట్టుకోవడంవల్ల బయల్దేరింది

చీకటిపడింది బస్సు పద్దెనిమిదిమైళ్ల దాకా వచ్చాక టైరు పేలిపోయింది బస్సు కాస్సేపు ఆగింది తీరా టైరువేసాక చూస్తే 'డైనమో' చెడిపోయింది బస్సు తొందరలో కదల లేదని తెలిసి, ప్రయాణికులు 'ఏం చెయ్యాలా?' అని ఆలోచించసాగారు వాసంతి అంతవరకూ తల వంచుకొని తనలోతను ఆలోచిస్తోంది ఆమె ప్రయాణికుల నెవ్వరినీ పరిశీలించలేదు ఎవరో ఒక ప్రయాణికుడు కండక్టరుని "రామనగరం ఇక్కడికి రెండుమైళ్లుంటుందికదూ ?" అని అడుగుతున్నాడు.

వాసంతి ఆ గొంతువిని, తను ఎక్కడో మునుపు విన్న గొంతుకలా ఉందని అనుకొని, ఆ వ్యక్తిని పరీక్షగా చూచింది గడ్డాలూ, మీసాలూ పెరిగి పోయి మాసినబట్టల్తో ఉన్నా, ఆ వ్యక్తి చంద్రమౌళేనని గుర్తించింది ఆమెకు తల ఒక్కసారి తిరిగినట్లయింది సంతోషం, సంభ్రమాలు ఆమెలో ఒక్కసారిగా పెల్లుబికినయి

"చంద్రమౌళిగారూ !"

"ఎవరు ? వాసంతా ?" అని ఆమెవైపు చూస్తూ ఆశ్చర్యపోయాడు చంద్రమౌళి ఏం చెయ్యాలో అతనికి తోచలేదు

"మీ రెక్కడికి వెళ్తున్నారు ?"

"రామనగరం"

"నేనూ రామనగరమే"

"బస్సు ఇంతలో కదల్దు మనం నడిచి వెళ్లచ్చు"

"పదండి వెళ్దాం"

ఆగిపోయిన బస్సునీ, ఖంగారుపడ్తున్న ప్రయాణీకుల్నీ, తెల్లబోయిన కండక్టరునీ వెనకాల వది లేసి, చేతిలో బెడ్డింగుతో చంద్రమౌళీ, చేతిలో సంచీతో వాసంతి రామనగరంవేపు నడక సాగించారు.

"ఈ ఊరు వస్తూనే, నిన్ను కలుసుకోవడం ఆశ్చర్యంగా ఉంది!"

"ఆరేళ్లతర్వాత మీరు కన్పించడం చాలా విచిత్రం"

"అవును వాసంతీ ఈ ఆరేళ్లలోనూ నువ్వు డాక్టరువయ్యా వనుకుంటాను నేను చాలా ఊళ్ళు తిరిగాను"

"నన్ను మీరు మర్చిపోయా రనుకున్నాను"

"లేదు వాసంతీ నువ్వూ, నీ సానుభూతీ నన్ను మనిషినిచేశాయి నాన్నగారికి వంట్లో బాగుండ లేదని తెలిసినా, నిన్ను చూసే అవకాశం లభిస్తుం దేమోననే, మూడురోజులక్రిందట కాశీనుంచి బయల్దేరాను"

"మీ రెక్కడి కెళ్లారో, ఎక్కడున్నారో తెలుసు కుందామని చాలా ప్రయత్నం చేశాము కానీ మీ ఆచూకీ తెలియలేదు"

"నేను మా అమ్మగారు పోయినతరువాత మూడుసంవత్సరాలు దేశమంతా నడకమీద, తిరిగి చివరకు కాశీ చేరుకున్నాను కాశీలో నాకొక స్నేహితుడు లభించాడు అతనూ, అతని భార్యా నన్నెంతో ఆదరించి, ఓదార్చి నాచేత నూత్నజీవితం ప్రారంభింప జేశారు ఎం ఏ కు కట్టి కాశీలోనే పాసయి ఆ యూనివర్సిటీలోనే లెక్చరరుగా పనిచేస్తున్నాను పదిహేనురోజుల క్రిందట డాక్టరుగారి కొక ఉత్తరం వ్రాశాను ఆయన, మా నాన్నగారికి చాలా సీరియస్‌గా ఉన్నట్లు టెలిగ్రాం ఇచ్చారు నేను వెంటనే బయల్దేరి వచ్చాను"

"అబ్బ ! ఎన్ని విచిత్రాలు జరిగాయో ?"

చంద్రమౌళి వాసంతి కబుర్లు చెప్పుకుంటూ ఊరిలోకి వచ్చేటప్పటికీ, సుదర్శనంగారు చావు బ్రతుకులమీదున్నట్లు తెలిసి వెంటనే చంద్రమౌళి ఇంటికి వెళ్లారు చంద్రమౌళి వెళ్లగానే, ఆఖరిసారి అతన్ని చూస్తూ, నోట మాటపడిపోవడం వల్ల, డాక్టరుగారివైపు వేలితో చూపించారు సుదర్శనంగారు.

డాక్టరుగారు, చంద్రమౌళి వచ్చినందుకు సంతోషించి అతనితో "మీ తండ్రిగారు తనను క్షమించమని కోరుతున్నారు ఆస్తిని నీ ఇష్టంవచ్చినట్లు చేసుకోమని వీలు వ్రాశారు నువ్వొక ఇంటివాడివి కావాలని కోరుతున్నారు ఆయన ప్రాణం వదిలేకముందు ఈ విషయాలన్నీ నీతో చెప్పమని నాతో చెప్పారు నువ్వు అందుకు అంగీకరించినట్లు ఆయనతో చెప్పి, ఆయన ఎడల సద్భావం చూపించవలసిందిగా కోరుతున్నాను" అన్నారు చంద్రమౌళి అంతా విని తండ్రివైపు చూచి తల ఊపాడు

సుదర్శనంగారు ప్రాణం వదిలేశారు చంద్రమౌళి తండ్రికి ఏలోటూ లేకుండా అంత్యక్రియలు జరిపించాడు. వాసంతీ, డాక్టరుగారూ పదిహేనురోజులవరకూ, తక్కిన పనులన్నీ వదిలిపెట్టి చంద్రమౌళి చేత జరిపించవలసిన కార్యమంతా నడిపించారు

అంతా అయిపోయినతరువాత ఒకనాడు డాక్టరుగారు చంద్రమౌళి ఏం చెయ్యబోయేదీ అడిగారు అతను తను ఈ విషయాలన్నీ ఆలోచిస్తున్నాననీ ఇంకా ఒక నిర్ణయానికి రాలేదనీ చెప్పాడు అంతలో వాసంతి వచ్చి తను విజయనగరం వెళ్లదల్చుకున్నట్లు చెప్పింది

చంద్రమౌళి వాసంతిని చూసి "వాసంతీ, నా తలితండ్రులు నన్ను విడిచిపోయారు మిగిలిన ఆప్తులు మీరిద్దరే మీకు కొన్ని విషయాలను తెలుపుదామనుకొంటున్నాను" అన్నాడు వాసంతి ఒక కుర్చీలో అతనికెదురుగా కూర్చుంది

చంద్రమౌళి ప్రారంభించాడు "నేను ఢిల్లీలో చదువుతున్నప్పుడు నాకు ఇస్మాయిల్ అని ఒక స్నేహితుడుండేవాడు మా యిద్దరికీ ప్రాణస్నేహం కలిసింది అతను విశాఖపట్నం నుంచి వచ్చాడు మొదటి ఏడాదంతా ఎంతో స్నేహంగా మెలిగాం. అతను కవిత్వం రాసేవాడు ఎప్పుడూ నవ్వుతూ సరదాగా ఉండేవాడు. అతన్ని చూసినవాళ్లెవరైనా అతనికేమీ చికాకులు లేవనుకోవలసిందే, అందర్నీ నవ్వించేవాడు"

"ఇస్మాయిల్, నేనూ కలసి రెండో ఏడు ఒక గది తీసుకున్నాం ఇద్దరం ఎప్పుడూ ఒకరినొకరం విడిచివుండేవాళ్లం కాము ఒకసారి అతను తల్లికి వంట్లో బాగులేదని ఉత్తరం వస్తే విశాఖపట్నం వెళ్లి వచ్చాడు అతను తిరిగి వచ్చినదగ్గర్నుంచీ, మనిషి పరాకుగా ఉండడం, గంభీరంగా ఉండడం మొదలెట్టాడు రోజురోజుకీ మనిషి సరిగా తిండితినక క్రమంగా చిక్కిపోసాగాడు నే నెన్నివిధాలా అడిగినా కారణం చెప్పలేదు"

"ఒకనాడు రాత్రి నేనూ, అతనూ చాలా రాత్రివరకూ మాట్లాడుకొని నిద్రపోయాం నాకు నిద్ర బాగా పట్టేసింది నేను తెల్లవారి లేచి చూచేసరికి, ఇస్మాయిల్ ఆ రూములోనే దూలానికి కట్టిన తాడుతో ఉరిపోసుకుని కన్పించాడు నేను హడలిపోయాను ఆ దెబ్బకి నా మనస్సు తట్టుకోలేకపోయింది"

"ఇస్మాయిల్ చనిపోతూ నా పేర నొక ఉత్తరం రాశాడు అందులో అతను విశాఖపట్టణం వెళ్లినప్పుడు తన తల్లికి ప్రాణాపాయం కలిగిందనీ, ఆమె చనిపోతూ కొన్ని మాటలు చెప్పిందట—అవేమిటో వివరిస్తూ, వాటికారణంగా తనకు జీవితంమీద విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకుంటున్నాననీ వ్రాశాడు అసలు యిస్మాయిల్ తల్లి మహమ్మదీయ స్త్రీ కాదుట ఆమె హైందవస్త్రీయే! ఒక ధనికుడు ఆమెను వంచించి, ఆమె శీలాన్నపహరించి, ఆమెకు గర్భం వచ్చాక, తా నప్పటికే వివాహితుడనని చెప్పి ఆమెను విశాఖపట్నం తీసుకొచ్చి ఒక ఇల్లు తీసుకుని ఆమెను ఉంచాడట ఆమె బిడ్డను కనేవరకు ఊరుకొని బిడ్డను కనగానే ఆబిడ్డ నెవరికైనా ఇచ్చెయ్యమని బలవంతంచేశాడట ఆమె మొదట్లో అందు కొప్పుకోకపోయినా తరువాత ప్రక్కయింటిలో ఉన్న ఒక ముస్లిం దంపతులకు పెంచమని ఇచ్చిందట వాళ్ళు అతన్ని పెంచి పెద్దవాణ్ణి చేశారు వాళ్లు చాలా బీదవాళ్లవడంవల్ల, ఇస్మాయిల్ కన్నతల్లే వారికి ధనసహాయం చేసేది అంతేకాకుండా ఆమె తరువాత

---

జనాభా ఎన్యూమరేటరు:- ఏమండీ ఈయింట్లో ఈనాలుగు రోజులనుండి ఎవరైనా పుట్టినారా?

ఒక విద్యార్థి:-ఇది విద్యార్థుల హాస్టలండీ ఇక్కడ పుట్టటమేమిటి.

జ. ఎ:- నాడ్యూటీ బాబూ? డ్యూటీసంగతి నీకేమి తెలుసు విద్యార్థివి.

పళ్లా నాగేశ్వరరావు (నాగాయలంక)

---

ఒక ఆడపిల్లనుకూడా కన్నది ఆపిల్ల, మహమ్మదీయనామంతో చెలామణి అవుతూ ఈ రెండిళ్లలోనూ తిరుగుతుండేది అమే, ఇస్మాయిల్‌కూడా తాము ముస్లిందంపతుల బిడ్డలమే ననుకొనేవారు కాని, కొందరికి ఈ రహస్యం తెలుసు"

"ఆ ముస్లిం దంపతులలో భర్త, ఇస్మాయిల్‌కి పన్నెండేళ్లప్రాయంలో చనిపోయాడు ఇస్మాయిల్ పెరిగి పెద్దవాడయ్యేవరకూ, అతనికీ, అతని చెల్లెలికీ ఆ కన్నతల్లే ధనసహాయం రహస్యంగా చేసేది ఆమె హఠాత్తుగా చనిపోయింది అప్పటికి ఇస్మాయిల్ చెల్లెలు ఎవరో అబ్బాయిని ప్రేమించి ఎక్కడికో వెళ్లిపోయింది ఇస్మాయిల్‌ని పెంచిన తల్లి జబ్బుపడిపోయింది ఇస్మాయిల్‌ని ఢిల్లీనుంచి పిలిపించి, అసలు విషయమంతా అతనికి చెప్పేసి తనింక చదివించలేనని చెప్పింది"

"అంతేకాక ఇస్మాయిల్ కన్న తండ్రెవరో చెప్పి, అతన్ని వెళ్లి ఆస్తిలో భాగం అడగమంది ఇస్మాయిల్‌కి జరిగినదంతా తెలిసి చాలా బాధపడ్డాడు తన కన్నతండ్రి ధనమదాంధతచేత, తనతల్లికి ద్రోహంచేశాడని, తా నింతవరకూ సంఘంలో గౌరవనీయ వ్యక్తి ననుకొంటూ బ్రతికి, ఒక కులటపుత్రుడి ననిపించుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఉత్తరంలో రాశాడు అంతేకాక తనను కన్న తండ్రియైన తనతల్లిని మోసంచేసిన దుర్మార్గుడిది రామనగరం అనీ, ఆయన పేరు సుదర్శనం అనీ కూడా వ్రాశాడు"

డాక్టరుగారూ, వాసంతికూడా "ఆ!" అన్నారు ఒక్కసారిగా

చంద్రమౌళి విచారంతో "అవును మా నాన్నగారే అందుకే ఆయనమీద నేను కోపంతో ప్రవర్తించేవాణ్ణి ఆయన్ని నేను అనేకసారులు ఇస్మాయిల్ చెల్లెలిగురించి వాకబుచెయ్యమనీ, ఆస్తిలో ఆమెకు భాగమిమ్మనీ కోరాను కాని, ఆయన విన్పించుకోలేదు అందువలన నాకా ఆస్తి అక్కరలేదని, ఇన్నాళ్లూ ఆయనకు దూరంగా తిరిగాను అంతిమసమయంలో ఆయన పశ్చాత్తాపం ప్రకటించడంవల్ల, నేను ఆ ఆస్తినంతా తాత్కాలికంగా స్వీకరిస్తున్నాను కొద్దిరోజులలోనే, ఇస్మాయిల్ చెల్లెలుగురించి వాకబుచేసి, ఎలాగైనా ఆమె ఆచూకీ తెలుసుకుని ఆమెకు ఈ ఆస్తిలో సగభాగం ఇవ్వదలచాను" అన్నాడు

డాక్టరుగారు చంద్రమౌళి ఉదార స్వభావానికి సంతోషం ప్రకటించారు ఇంతలో డాక్టరుగారికోసం ఎవరో అర్జంటుకేసుందని వచ్చారు. డాక్టరుగారు చంద్రమౌళితో తను మళ్లీ వచ్చి అతన్ని కలుసుకుంటానని చెప్పి వెళ్లిపోయారు. వాసంతీ చంద్రమౌళీ మిగిలిపోయారు

సాయంకాలం ఆరుగంటలయింది వాసంతి అవాళ్టికి విజయనగరం వెళ్లే ఉద్దేశం మానుకుంది ఎదురుగుండా చంద్రమౌళి తనతో ఏదో చెప్పాలనుకుంటూ, మళ్లీ ఆగిపోయినట్లు గమనించింది తనూ అతని కళ్లల్లోకి చూచింది "పాపం! ఇదంతా మనస్సులో ఉంచుకొని అంత బాధ పడ్డారన్నమాట!" [illegible] జాలిగా అతనివైపు చూసింది

"అవును [illegible] ఎన్నాళ్లో నా మనస్సులో చెరగని ముద్రలా ఉండి, నన్ను బాధించింది ఇంతా చేస్తే అతను నా సోదరుడవటం, మేమిద్దరం ఒక తండ్రిబిడ్డ లవటం నన్ను మరీ బాధించేది"

"అవును మీ బాధ నా కర్థమైంది"

"ఆ సమయంలో నీ సానుభూతే నన్ను రక్షించింది"

"ఏంలాభం ? ఎక్కువకాలం మీతో గడపలేకపోయాను"

"ఫరవాలేదు కొంతవరకు నా తల్లి మరణంవల్ల కలిగిన దుఃఖానికి, నీకిచ్చిన వాగ్దానంవల్లే నేను తట్టుకోగలిగాను"

"నాకన్నా మీ స్నేహితు లెవరో మీకు చాలా ఉపకారం చేశారు"

"అవును రామారావు, జలజా ఇద్దరూ ఎంతో మంచివాళ్లు" అని ఒక్క నిముషం ఆగి, చంద్రమౌళి "వాసంతీ ఈ ఆరేళ్లలోనూ—నీ ధ్యానతోనే జీవించాను"

"నేనంత అభిమానానికి పాత్రురాలిని కాదు."

"లేదు, వాసంతి నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను నన్ను పెండ్లిచేసుకోమని ప్రార్థిస్తున్నాను"

వాసంతి జవాబివ్వక తన తల ప్రక్కకి తిప్పుకుంది

"ఈ జీవితం అంధకారమయమవుతుం దను కున్న సమయంలో నువ్వొక వెలుగు చూపించావు నీ అభిమానంతో నన్ను మనిషిని చేశావు నీ కోసమే నేను జీవించాలనుకునేట్టు చేశావు నీతో గడిపిన క్షణాలే, మధుర స్మృతులుగా మనస్సులో నిలిచి, అంతకుపూర్వం మనస్సు నావరించిన నీలి నీడల్ని తొలగించివేశాయి నువ్వు నా దేవతవు" అని చంద్రమౌళి ఇంకా ఏమేమో అనబోతుంటే వాసంతి తనకుర్చీలోంచి లేచి వచ్చి చంద్రమౌళి భుజం మీద చెయ్యివేసి,

"కాదు, డాక్టర్ని" అంది చిరునవ్వు నవ్వుతూ

"అందుకే తొందరగా ఈ— మందు ఇమ్మంటున్నా!"

"ఏం మందూ ?"

"ప్రేమ—అనే మందు"

"భలేవారే!" అంది వాసంతి నవ్వుతూ చంద్రమౌళి నవ్వాడు

న్యాయానికి తండ్రిపోయిన కొన్ని నెలలదాకానైనా తనవివాహం అవడం మంచిదని తోచినా, తన చికాకుల్లో వాసంతిసహకారం లేందే నిర్వహించలేనని, తండ్రి పోయిన రెండు నెలల తర్వాత వాసంతిని చంద్రమౌళి వివాహంచేసుకోడానికి నిశ్చయించాడు

ముహూర్త మింక రెండురోజు లుంది

చంద్రమౌళి హుషారుగా రింటికి వెళ్లి, 'వాసంతి నా స్నేహితులు జలజా, రామారావూ మెయిల్లో వస్తున్నారు మనం వెళ్లి రిసీవ్‌చేసుకోవాలి పద" అని వాసంతిని బయల్దేరతీశాడు ఇద్దరూ విజయ నగరం స్టేషనుకు బయల్దేరారు

మెయిలులో దిగిన యువతీ యువకుల్ని చూసి వాసంతి నిర్ఘాంతపోయింది జలజా, రామారావు చంద్రమౌళిని ఉత్సాహంతో పలకరించి వాసంతివేపు తిరిగారు

" ఓ! వాసంతీ ! జ్ఞాపక మున్నానా?" అంది జలజ

"సురయా !"

"అవును అప్పుడు సురయానే ఈయన్ని పెళ్లిచేసుకుని బ్రహ్మసమాజంలోచేరి జలజ నయ్యాను" అంది నవ్వుతూ, రామారావును చూపించి

"అలాగా! కొత్తపేరు పెట్టుకున్నావన్నమాట!" అంది వాసంతి

చంద్రమౌళి వాళ్ళ సందర్భి కారెక్కించి, రామారావుతో హుషారుగా మాట్లాడుతూ, రామ నగరంవైపు కారు పోనిచ్చాడు

కారులో వాసంతీ, జలజ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు

"మీ దంపతుల ఆదరాభిమానాల్తో ఆయన బాగా ఆరోగ్యవంతులయ్యారు" అంది వాసంతి జలజతో

"ఇందులో విశేషమేముంది వాసంతీ అతని మీద నీకన్నా నా కెక్కువ బాధ్యత ఉంది అది మీ ఇద్దరికీతెలియదు అతను నా సోదరుడు" అందిజలజ

"స్వంతసోదరికన్నా ఎక్కువ సేవచేశావు."

"అతను నా స్వంత సోదరుడే"

వాసంతి అర్థంకానట్టు ఆమెవైపు చూసింది.

"ఈ విషయం నేను వెల్లడించకూడదని ఇంత వరకూ అనుకున్నాను కాని అతను మొన్న మాకు వ్రాసిన ఉత్తరంలో తనకొక చెల్లెలుందనీ, ఆమె కోసం వెతకదల్చుకున్నాననీ వ్రాశాడు అందుకని ఈ విషయం బైటపెట్టదల్చుకున్నాను నా సోదరుడు ఇస్మాయిల్‌కి తెలియకపూర్వమే నాకు ఈ వివరాలన్నీ, మమ్మల్ని పెంచిన ఆమెద్వారా తెలును" అని జలజ అంటూంటే, కారు డ్రైవు చేస్తూ, వీరి మాటల్ని వింటున్న చంద్రమౌళి, గబుక్కున వెనక్కి తిరిగి "ఆ ! నువ్వు నా సోదరివా ?" అన్నాడు

వెనకనుంచి రామారావు స్టీరింగు పట్టుకొనకపోతే కారుకు యాక్సిడెం టయ్యేది

"అవును" అంది జలజ రామారావు కారుకు బ్రేకువేశాడు చంద్రమౌళి ఆశ్చర్యానందాలతో కన్నీరుకారుస్తూ, కారు దిగి, వెనకసీటులోకి వెళ్లి, జలజచేతులు పట్టుకుని "నీది అమృత హృదయం" అన్నాడు

"అన్నయ్యా ! మామీద సానుభూతితో నీ మనస్సునే పాడుచేసుకున్నావు"

"ఫరవాలేదు నా సోదరుణ్ణే పోగొట్టుకున్నా, నిన్నయినా పొందగల్గాను" అని కన్నీరు కార్చాడు.

"రావోయ్ ! ఆకలేస్తోంది తొందరగా ఇంటికి పోదాం" అని రామారావు హెచ్చరించాక చంద్రమౌళి వచ్చి స్టీరింగు పట్టుకొన్నాడు ★

---

# ఆదర్శాలు-ఆంతర్యాలు

(29వ పేజీ తరువాయి)

తిప్పించుకొనేటోడు" అన్నాడు సత్తిగాడు

"అగో పాండయ్య ఏంటో సెప్తున్నడు గమ్మునుండండహె—లొల్లిసేయక" మరో కార్మికుడు కసురుకున్నాడు

రంగపాండు మైకుదగ్గర నిలబడి గొంతు సవరించుకొని "కార్మిక సోదరులారా, ఈ రోజు మనకు చాలా మంచిరోజు ఎందుకంటే మీ మిల్లు కూలీ లంతా ఒక సంఘంగా ఏర్పడడం, దానికి మీతోటి పనివాడైన రాజయ్యను మీరంతా ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకొని ఈ రోజు ఇక్కడ సమావేశం కావడం అని మీ అందరకూ తెలుసు మరి ఒక ముఖ్యవిశేష మేమిటంటే అర్జంటుగా పట్నం పోవలసిన పని ఉన్నప్పటికీ, దానిని మానుకొని ఈ సమావేశానికి అధ్యక్షతవహించడానికి అంగీకరించిన కార్మికనాయకులు, పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ శ్రీ చలమయ్యదొరవారికి మిల్లు కార్మికులమీద ఎంత సానుభూతో నేను వేరే వివరించ నక్కరలేదు" అని చెప్పుకుపోతున్నాడు

"నూసినావుర సీతాయ్ దొరవారికి అర్జంటుగా పట్నంపోయే పనుండెనంట . అది మానుకొని ఉండిపోయిండ్రంట" అన్నా డొక కార్మికుడు

"గట్ల సెప్పక ఉన్న సంగతి సెప్తారె ఓరన్న" అన్నాడు సీతాయి

సంఘం ఏర్పరచవలసిన అవసరాన్నిగూర్చి, మిల్లు యాజమాన్యం కార్మికులపట్ల చూపుతున్న విధానం గురించి చెప్తూ రంగపాండు "మీ కార్మికులంతా ఐకమత్యంతో ఉన్ననాడు మీ హక్కులను మీరు సాధించుకోగలుగుతారు మిల్లు యజమానులు ఎక్కువ లాభాలు గడిస్తూకూడా మీ జీతాలు పెంచడంలేదు మనఒక్క ఊళ్లో తప్ప తతిమ్మాచోట్ల ఉన్న మిల్లుల్లో పనిచేసే కార్మికులకు బోనసులు ఇస్తున్నారు ఒకవేంప ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి ఇటువంటి పరిస్థితుల్లో జీతాలు పెంచితేగాని మీరు కడుపునిండా తినలేరు" అని ఉపన్యాసమిచ్చాడు

రంగపాండు ఉపన్యాసం కార్మికులను చాలా మందిని ఆకర్షించింది

"ఉన్నది ఉన్నట్టు సెప్పిండురా సత్తిగా .. ధరలు జాస్తె గట్ల మండిపోతాండె, జీతాలు నూస్తె గిట్లుండె" అన్నాడొకడు

"మంచిగనే సెప్పిండుగనీ, ఇటు జీతాలు పెర్గితె అటు ధరలు పెరగకుండుంటాయె" అన్నాడు సత్తిగాడు

"ఔనోసి యాపారం చేసేటోల్లు ఊరుకుంటారు, జీతాలు పెంచిండ్రు అని యినంగనె ధరలు పెంచేస్తరు ఇంక మనకి జీతాలు పెర్గినయని సంబరమేముందారి" అన్నాడు మరొకడు.

"ఊకె ఒర్లకుండకె .. అగో ... చలమయ్యదొర ఏందో మాటాడుతున్నడు" అని కసిరాడు ఓ కార్మికుడు

"కార్మికసోదరులారా, ఈ స మా వే శా ని కి నన్ను అధ్యక్షులుగా చేసినందుకు మీ అందరికీ నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాను మీ ఇబ్బందులు, మిల్లుయజమానులు మీపై చూపుతున్న నిర్లక్ష్యం అన్నీ నేను రంగపాండుగారి ద్వారాను, మీ సంఘం అధ్యక్షుడు రాజయ్య ద్వారాను విన్నాను మీ న్యాయమైన కోరికలను తీర్చడం మిల్లు యజమానుల ధర్మం. వాళ్ళ విధి ఈ విషయమై మీరు ఆందోళన చేయవలసిందే! మీ కోరికలను తెలుపుతూ ఒక ముసాయిదా తయారుచేసి యజమానులకు పంపించాలి. అందుకు వారు ఒప్పుకోకపోతే మీరు ఐకమత్యంగా, అంటే మీరంతా కలసి మెలసి, పోరాడాలి అవసరమైతే సమ్మెచేయాలి మీకు అన్నివిధాలా సహాయంచేసేందుకు నేను, మా పార్టీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాం" అని చలమయ్య మాట్లాడుతూంటే 'చలమయ్యదొరకు జై" అంటూ కరతాళ ధ్వనులు చేశారు కార్మికులు

"ఇప్పుడు మన ఊరి హైస్కూలు విద్యార్థి ఒక పాట పాడుతాడు" అన్నారు చలమయ్యగారు.

ఆ విద్యార్థి మైకుముందుకు వచ్చి గొంతు సవరించుకొని పాట ప్రారంభించాడు.

"వినరండోయ్—వినరండోయ్!